# పుస్తకపరిచయాలు

2012





శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net



కౌముది ప్రచురణలు - 118

# కౌముది లో 2012 సంచికలలో ప్రచురితమైన

# పుస్తకపరిచయాలు

## విషయసూచిక


| పుస్తకం పేరు | రచయిత(త్రి) | పేజి |
|---|---|---:|
| వర్తమాన సంధ్య | డా గంధ్ర లక్ష్మణరావు | 3 |
| జననీ | మైత్రి | 4 |
| మరిగే తారు సరోవరం | ఎస్ గణపతి రావు | 5 |
| కైవల్యం | టి శ్రీవల్లీ రాధిక | 6 |
| పినల గర్ర | ఆర్ రామకృష్ణ | 7 |
| విద్వాన్ విశ్వం | డా నాగసూరి వేణుగోపాల్ | 8 |
| వెలుగు రేకలు | సుపాణి | 9 |
| అదివో అల్లదివో | ఎం వెంకటేశ్వరరావు | 10 |
| ట్రావెలాగ్ ఈస్టర్న్ యూరప్ | మల్లాది వెంకట కృష్ణమూర్తి | 11 |
| నాట్యపద్మం | శ్రుతకీర్తి | 12 |
| పిల్లల హిత కథలు | మల్లాది వెంకట కృష్ణమూర్తి | 13 |
| మేము మా హీరోలు | పరుచూరి బ్రదర్స్ | 14 |
| కె బి కృష్ణ కథలు ఒక పరిశీలన | కాకరపర్తి దుర్గాప్రసాద్ | 15 |
| మరవరాని మాటలు | బూదరాజు రాధాకృష్ణ | 16 |
| శారద ఎస్ నటరాజన్ | విహారి | 17 |
| ప్రతీచి లేఖలు | డా శారద పూర్ణ | 18 |
| కాలం దాటని కబుర్లు | బలభద్ర పాత్రుని రమణి | 19 |
| యుగం మారింది | కొమరవోలు సరోజ | 20 |
| అభిషేకం | కె బి కృష్ణ | 21 |
| చింతలవలస కథలు | డా మూలా రవికుమార్ | 22 |

| | | |
|---|---|---|
| మిసిమి | నరిసెట్టి ఇన్నయ్య | 23 |
| తెలుగు పద్యాలా బాబోయి! | ఇంద్రగంటి శ్రీనివాస శాస్త్రి | 24 |
| అగ్రహారం కథలు | వేదుల సుభద్ర | 25 |
| నిప్పుల తుఫాన్ | ఎస్ గణపతి రావు | 26 |



# పుస్తక పరిచయం




*Published by:*
**Samath a Publications**
**Karim Nagar**

*For Copies:*
**Gandra Vijaya**
*10-3-537 Vivekanandapu*
*Karim Nagar – 505001*
*(O) 98493 28036*
*Visalandhra Book House*
*Navodaya Book House*

**పదాడంబరాలు లేవు,** సంక్లిష్టమైన భావజాలాలు లేవు, అర్థంకాని ప్రతీకలు లేవు, ఎవరికి వారే ఊహించుకోండి అనే వాదం లేదు, 'నేను కవిని, నేను రాసింది మీరు చదవాలి' అనే నియంతృత్వంలేదు.. - అందుకే ఇదొక మంచి కవితల సంపుటి. రచయిత చిత్తశుద్ధికి ఇందులోని ప్రతి కవితా నిదర్శనంగా నిలుస్తుంది. సరళమైన శైలీ, ఎక్కడా బ్రెయిన్ టీజ్ చెయ్యని భావాలూ కలిసి ప్రతి కవితనీ పాఠకుడి మనసుకి సూటిగా తాకేలా చేస్తాయి. చాలా కవితల్లోని లయాత్మకత మళ్ళీ మళ్ళీ చదివించేలా చేస్తుంది. ప్రతి కవితలోనూ లోతైన ఆలోచన, ఆ ఆలోచనకి అందరికీ సులభంగా అర్థమయే రూపం - కవి సృజనాత్మకతకే కాక ఆయన ప్రతిభకి కూడా అద్దం పడతాయి. ' మనిషి / ఒక నది కావాలి / కనీసం / ఒక ఊటయినా కావాలి' అనడంలో ఎన్నో భావాలని పొదిగారు. 'నిదురించే ఊహలకు / కదిలించే దృశ్యాలకు / మదినింపే భావాలకు / ప్రతిరూపాలు కళలు ' గేయరూపంలోని శైలే చదువరిని ఆసక్తికరంగా ముందుకి నడిపిస్తుంది. 'మట్టి పండితే బతుకు / మట్టి ఎండితే చావు / మట్టితో వచ్చిన శరీరం / మట్టిలో కలిసిపోవడం ఖాయం / బ్రతికినంత కాలం గట్టిదనం / ఎందుకంటే అది మట్టిగుణం' మరీ సైన్సుని వెదక్కుండా భావుకతా దృష్టితో చూస్తే ఇలాంటి కవితా పంక్తులు ఆలోచనలని రేకెత్తిస్తాయి. 'ఈ చిన్ని గదిలో..' అనే కవిత చాలా నొస్టాల్జిక్‌గా వుంది. ఆయన పనిచేసిన కాలేజీలోని తెలుగుశాఖ గది గురించి వ్రాస్తూ 'ఇరుకైన / ఈ చిన్ని గదిలో /.. / ఎన్ని ఊపిరులు ఇక్కడ కవితలకు పురుడు పోసుకున్నాయో / ఎన్ని పద్యాలు రాగాలొలికాయో..' అంటారు కవి. పోల్చుకోగలిగే ప్రతివారికీ వారి కాలేజీ తెలుగు శాఖలు గుర్తొస్తాయి. బ్రతుకువీరుడులో కవి వ్రాసిన 'నడుము పడిపోయినా / బతుకుపై / ఉడుము పట్టుగలవాడు / కాళ్ళు చతికిల పడినా / కలంపై నిలబడ్డవాడు.' అంటూ వ్రాసిన వాక్యాలు సందర్భానుసారం ఎవరికైనా ఉదహరించదగిన నిత్యజీవిత సత్యాలు. పుస్తకానికి ఉపోద్ఘాతంగా అద్దేపల్లి రామ్మోహన రావుగారు వ్రాసిన వ్యాసం అత్యంత సమగ్రంగా కవినీ, కవితాత్మనీ విశ్లేషించింది. కవి డా.గండ్ర లక్ష్మణరావుగారు 'ఈ వర్తమాన సంధ్యలో సామాజికత, మానవీయత, దార్శినికత, తాత్వికత, నగరికత, నాగరీకత, పల్లీయత, పరాయణీయత, కుటుంబం, బాంధవ్యం.....మొదలైన వాటినన్నింటినీ సమర్థవంతంగా స్పృశించాడు' అని వ్రాసిన డా.వెల్చాల కొండలరావుగారి వాక్యాలు నూటికి నూరు శాతం నిజమని ఈ కవితా సంపుటి చదివిన ప్రతివారూ అంగీకరిస్తారు. * **




**అమెరికాలోని జార్జియా రాష్ట్రంలో** మైత్రి అనే సంస్థ ఉంది. ఎలాంటి సభ్యత్వ రుసుము లేకుండా సేవా దృక్పథం, మైత్రీ భావంతో ఏర్పాటు చేసిన లాభాపేక్షలేని సంస్థ ఇది. అమెరికా సందర్శనకు వచ్చే కుటుంబాలకు సేవలందించడం ముఖ్యోద్దేశం అయినా ఇక్కడే స్థిరనివాసం ఏర్పరుచుకున్నా వయోవృద్ధులు.. ఇతరులెవరైనా వారితో మాట్లాడలనుకునే ప్రతి ఒక్కరికీ ఇందులో ప్రవేశం ఉంటుంది. ఇది చాలా వినూత్నమైన కలయిక. ఎంతో ఉపయోగకరం కూడా. ఎందుకంటే ముఖ్యంగా పిల్లల దగ్గర ఉండడానికి అమెరికా వచ్చే పెద్దవారి సమస్యలు  విలక్షణంగా ఉంటాయి. తమతో కలిసి తమ భావాలను పంచుకునే వారికోసం ఎదురుచూడ్డం సహజం. అలాంటి వారికి కేవలం కాలక్షేపాన్నే కాకుండా సమయ సద్వినియోగానికి కూడా ఉపయోగపడే సంస్థ మైత్రి. ఈ సంస్థ కార్యకలాపాలు కూడా చాలా చురుగ్గా ఉంటున్నాయి. ముఖ్యంగా ఆ సంస్థ సభ్యులు, ఇంకా ఇతర రచయితల రచనలతో కలిపి ప్రచురించిన కదంబం ఈ 'జననీ'. ఇందులో కథలున్నాయి, కవితలున్నాయి, వ్యాసాలున్నాయి, ఆంగ్ల రచనలూ ఉన్నాయి. ఈ పుస్తకం ప్రచురణ వెనుకనున్న స్ఫూర్తిని సంపాదకుడు విజు చిలువేరుగారు హృదయానికి హత్తుకునేలా ముందుమాటలో వివరించారు. 'మైత్రీవనం' అన్న కవితలో ఇందిరగారు వ్రాసిన భావాలు మైత్రి లోని సభ్యులందరి భావాలేమో అనిపిస్తాయి. 'కన్న బిడ్డల వైభవం' కనులారా చూడాలని ' దేశం కాని దేశానికొస్తే / .../ పలుకరించే మనిషి లేక / చిలుకరించే మమత లేక..' ఇది వాస్తవానికి దర్పణం! అధికశాతం కథలూ, కవితలూ, వ్యాసాలు..కేవలం కాలక్షేపం కోసం వ్రాసినవి కాదు. ప్రతిదీ ఒక సిన్సియర్, సీరియస్ భావాన్ని పాఠకులకు చేరవేయాలనే తపనతో రూపుదిద్దికున్నవి. వీటన్నింటినీ ఇలా గుదిగ్రుచ్చి పుస్తకరూపంలో ఒక జ్ఞాపికగా తీసుకురావడం అనే కృషి ఎంతైనా ప్రశంసనీయం. ఇందులో పాలు పంచుకున్న ప్రతి ఒక్కరూ అభినందనీయులే.

*Published by:*
**Maitri Media**
**435 Gavenwood Dr**
**Lawrenceville**
**GA 30044 , USA**
**http://www.ourMaitri.org**



# పుస్తక పరిచయం




**సామాజిక విప్లవం** కోసం కొత్తతరం కథలు అని ముఖచిత్రం మీదే ప్రకటించారు ఈ కథాసంపుటి రచయిత గణపతిరావుగారు. సమకాలీన సమాజంలోని వివిధకోణాలని తీసుకుని నాటకీయతని జోడించి వ్రాసిన కథలు ఇవి. కాలక్షేపం, వినోదం కోసం వ్రాసిన కథలు కాదు. సమాజంలోని వికృతపోకడలని, హింసా ప్రవృత్తినీ, అసహజ మానసిక ప్రవర్తనలనీ రచయిత విశ్లేషిస్తూ వ్రాసిన కథలు ఇవన్నీ. ఒక్కో కథా చదువుతుంటే ఒక డాక్యుమెంటరీనో, వాస్తవ లేదా అధువాస్తవికత ధోరణిలో నిర్మించబడ్డ సినిమాలోని దృశ్యాలో చూస్తున్నట్లుంటుంది. ఈ కథలకి అంతర్జాతీయంగా పాఠకుల ప్రసంశలు విశేషంగా లభించాయి. బహుశా వారంతా ఈ కథలని ఇంగ్లీషులో చదివి వుండాలి. భారత సమాజ నేపథ్యంలో వ్రాయబడ్డ కథల గురించి అంతర్జాతీయ పాఠకుల అభిప్రాయాలు తెలుసుకోవడం కూడా ఆసక్తికరంగా ఉంటుంది. లంక భాస్కర్ చిత్రించిన ముఖచిత్రం, నర్సిమ్ చిత్రించిన లోపలి బొమ్మలు ఈ పుస్తకానికి ఒక ప్రత్యేకతని సంతరించిపెట్టాయి. పుస్తక ముద్రణ గెటప్ కూడ చాలా క్వాలిటీతో ఉంది. ప్రతి కథకి వ్రాసిన నినాదాల్లాంటి పరిచయ వాక్యాలు కథాంశాన్ని స్థూలంగా పరిచయం చేస్తున్నాయి. ‘మనిషి ఉనికి ప్రేమ. ప్రేమతో తాకితే రాయి అహల్య. ద్వేషంతో రెచ్చిపోతే అందాల ప్రకృతి కార్చిచ్చు‘ అనే ప్రథానాంశంతో వ్రాసిన కథ ఈ పుస్తకానికి శీర్షిక ఐన ‘మరిగే తారుసరోవరం‘. అలానే ‘చేసిన నేరాలు వేటకుక్కల్లా తరుముకొస్తుంటే తన అక్రమాస్తులు చితిగా మారి, మండిపోతున్నాయి‘ అనుకునే ‘పెద్దప్పరాయుడు‘, ‘ఎత్తుకుని, ముద్దాడి, లాలించాలనే వృద్ధాప్యబాల్యం, మనిషి మనుగడ పాదాల కింద క్షణక్షణం యమగండం‘ అని నిరూపించే ‘మనమింతేనా?‘.. ఏ కథచదివినా సమాజంలోని కుళ్ళు, అవినీతి, అక్రమాల మీద రచయిత ఆవేశం నిలువెత్తున ప్రతిబింబిస్తుంది. వాక్య నిర్మాణం, రచనా శైలి కూడా విలక్షణంగా ఉన్నాయి. గణపతి రావుగారి సరికొత్త ప్రయోగం కథాప్రియులకు నచ్చుతుందని ఆశిద్దాం.

* **

*Published by:*
**S.Ga napathi Rao**
**26/1 Kaveri Street, Saligramam**
**Chennai – 600 093**

*For Copies:*
*Visalandhra Book House*
*Navodaya Book House*




**అర్థవంతమైన కవితలు,** అర్థమయ్యే కవితలు, ఆలోచించి వ్రాసిన కవితలు, ఆలోచింపచేసే కవితలు...వ్రాసే అతికొద్ది మంది ఆధునిక కవయిత్రులలో రాధికగారు ఒకరు. ముందు మాటలో రచయిత్రిగారు వ్రాశారు -'కైవల్యం' అనే కవిత జీవితంలో తన ఆలోచనాధోరణిని మార్చివేసిన ఒక మలుపులో వ్రాసిన కవిత అని. ఆ మలుపు తర్వాత ప్రపంచాన్ని గురించి కలుగుతున్న భావనలు వేరు అని కూడా పేర్కొన్నారు. ఈ కవితల్లో చాలా భాగం వాస్తవ చిత్రణతో మొదలై ఆ-ధ్యాత్మిక భావనలను అల్లుకుని ఒక చక్కటి ముగింపుతో పూర్తవుతుంది. 'అన్నీ తెలిసిన భాషలే / అయినా మాటలు అర్థం కావు / మళ్ళీ మళ్ళీ చూసిన మొహాలే / అయినా మనసులో నిలబడవు ' ఇదంతా వాస్తవాన్ని చూపిస్తే 'మనుషుల్ని ఒకచోట / మనసుల్ని మరోచోట విసిరేసి/ మరణించే లోపల వెతుక్కోమంటాడు (దేవుడు)' అంటూ తన ఆలోచనా ధోరణిలోని మరోకోణాన్ని ప్రదర్శిస్తారు రచయిత్రి. ఏ కవితా అలవోకగా చదివి మరచిపోయేది కాదు. 'మందులేని గాయాలని మాన్పగలదు / మండించే వేదనలని ఆర్పగలదు ( కాలం) ' లాంటి వాక్యాలు ఎక్కడైనా ఉదహరించడానికి సరిపోతాయి. ముందుమాటలో ప్రముఖ కవి అద్దేపల్లి రామ్మోహనరావు గారు ఈ కవితా సంపుటి గురించి తనదైన శైలిలో చక్కటి విశ్లేషణ వ్రాశారు. చివరి అట్టమీద - ఆశీస్సులనందించిన సామవేదం షణ్ముఖ శర్మగారు "సామాజిక రీతుల్ని విశ్లేషించి ఎత్తి చూపుతూ, మనో ప్రకృతిలోని వికృతుల్నీ, వివిధ మనోభావాల వెలుగునీడల్నీ - కవిత్వపు విలువలు కదిలిపోకుండా, పకడ్బందీగా వీటిలో పరామర్శించారు. " అన్నారు. ఈ మాటలు అక్షర సత్యాలని ఈ కవితా సంపుటి చదివిన ప్రతి ఒక్కరూ అంగీకరిస్తారు.

* **

*Published by:*
**Pram atha Publications**
**Hyderabad – 500 070**
**For Copies**
**T.Srivalli Radhika**
**5-4-345 Road Number 5**
**Kamala Nagar, Vanasthalipuram**
**HYDERABAD – 500 070**
**Phone : 040-2412 4124**

# పుస్తక పరిచయం




**రచనలో స్పష్టత ఉన్న కవిత్వం ఆలోచింపచేస్తుంది.** ఆలోచింపచేసే కవిత్వం హృదయాలను కదిలిస్తుంది. ఇది 'పినలగర్ర' కవితా సంకలనం విషయంలో నూటికి నూరుశాతం నిజం అనిపిస్తుంది. ఉత్తరాంధ్ర బొబ్బిలి ప్రాంతంలో పిల్లనగ్రోవిని పినలగర్ర అంటారట. ఆ పేరునే తన కవితాసంకలనానికి శీర్షిక చేసుకున్నారు కవి. ఆర్.రామకృష్ణగారు. ఈయన 1982-99 మధ్యకాలంలో రాసిన 38 కవితల సంపుటి ఈ పుస్తకం. గత 20 సంవత్సరాల్లో అతి తక్కువగానే కవితలు వ్రాశానని ముందు మాటలో చెప్పారు రచయిత. ఐతే ఎన్ని కవితలు వ్రాశారు అనేదాని కంటే ఎన్ని 'నిలిచి' పోయే కవితలు వ్రాశారు అన్నకోణంలో చూస్తే రామకృష్ణగారు చాలా ఎక్కువ కవితలు వ్రాశారనే చెప్పుకోవాలి. ఇందులోని ప్రతి కవితలో, ప్రతి పంక్తిలో కవి సొంతగొంతుక వినిపిస్తుంది. సాధారణమైన కవితా వస్తువులే ఈ కవి కలంలో అసాధారణమైన కవితలుగా రూపుదిద్దుకున్నాయి. తనవైన పదచిత్రాలతో బాటుగా రామకృష్ణగారి ప్రత్యేకత ఏమిటంటే - చాలా కవితలని కొసమెరుపుతో ముగించడం. కథల్లో ఈ కొసమెరుపు ప్రక్రియ ఎక్కువగా చూస్తాం, కానీ కవితల్లో ఇలాంటి కొసమెరుపు వాక్యాలు చాలా అరుదుగా కనిపిస్తాయి ఈ టెక్నిక్‌ని రామకృష్ణగారు అత్యంత ప్రతిభావంతంగా తన కవితల్లో ప్రయోగించారు. మొట్టమొదటి కవిత 'జముకుల పాటగాడు' చదువుతుంటే ఆ 'ప్రాణవాయువంతా గూడుకట్టిన' ఆ ప్రదేశానికి వెంటనే వెళ్ళిపోతాం. 'పదాల పూలరేకుల నడుమ తన హృదయాన్ని గుచ్చి ఇచ్చిన' జముకుల పాటగాడిని చూసి, వినీ తరిస్తాం. కొసమెరుపు వాక్యం ఒక్కసారి చెంపపెట్టులా తగులుతుంది, నిలబెట్టి ప్రశ్నింపచేస్తుంది. రాత్రంతా అతని పాటవిన్న వాళ్ళు పొద్దున్నే గంజికోసం వస్తే అతన్ని చూసిన విధానం గమనించి 'రాత్రి అతని చుట్టూ తలలూపినవి నాగుపాములని' కవి స్పష్టీకరించడంతో కవిత శిఖరస్థాయికి చేరుతుంది. ఇలానే ప్రతి కవితా.. 'అమ్మ' అనే కవితలో మనసుని మెలిదిప్పే దృశ్యాన్ని కళ్ళముందు నిలుపుతారు రామకృష్ణగారు. ఇక్కడా అంతే 'ఆ మాటలు వాడికెప్పటికీ అర్థం కావు ' అనడంతో పాఠకుడి మనసుని ఎక్కడో విసిరేస్తారు. ప్రకృతిలో అందరూ అనుకునే నిర్జీవ పదార్థాల్లో సజీవత్వాన్ని నిరూపిస్తూ చివరలో 'ఆలోచనలేని మనిషి ' మాత్రమే నిర్జీవ పదార్థమనడంలో రామకృష్ణగారి శైలి కనిపిస్తుంది. ఈ సంపుటిలో కవితలలో ఎక్కువభాగం పల్లెపట్టున, పంటపొలాలగట్ల మీద, మట్టివాసనల్లో..తిరుగాడేవే. 'నగరంలో హృదయం పరచిన తల్లి' లాంటి, 'అమ్మచేతి పాయసం' లాంటి ఇందులోని ప్రతి కవితా మనసుని కదిలిస్తుంది. పుస్తకం పూర్తయాక కూడా ఇందులోని భావాలు, దృశ్యాలు పాఠకుడిని వెంటాడుతూనే ఉంటాయి. రామకృష్ణగారు కవితలు వ్రాయడం కొనసాగించి ఉంటే తెలుగు కవిత్వంలో ఇంకెన్నో ఆణిముత్యాలు రూపుదిద్దుకుని ఉండేవి. **

***Poet Address***
**R. Ramakrishna**
**15-117 Virat Nagar**
**R.R.V.Puram(P.O)**
**Visakhapatnam – 530 029**
**Phone: 944 017 5465(India Cell)**
**Email:Reddiramakrishna63@gmail.com**

***For Copies:***
***Visalandhra Book House***
***Navodaya Book House***
***Prajashakti Book House***




**తెలుగుసాహిత్యంలో** ఇదొక అరుదైన పుస్తకం. విద్వాన్ విశ్వంగారి పేరు వినగానే 'ఆంధ్రప్రభ' వారపత్రిక, అందులో ఆయన 20 సంవత్సరాలు నిరంతరాయంగా నడిపిన 'మాణిక్యవీణ' శీర్షిక గుర్తొస్తాయి. అలాగే 'పెన్నేటి పాట ' కావ్యం కూడా. ఈనాటి రచయితల తరానికి విద్వాన్ విశ్వంగారి పేరు అంతగా తెలీదంటే అందుకు కారణం వారి గురించిన సమగ్రమైన గ్రంథం ఏదీ ఇంతవరకూ వెలువడక పోవడమే. ఆ లోటుని భర్తీ చేస్తూ డా.నాగసూరి వేణుగోపాల్, కోడీహళ్ళి మురళీమోహన్‌గార్లు కూర్చిన ఈ పుస్తకం విద్వాన్ విశ్వంగారి 'విశ్వ'రూపానికి అద్దం పడుతుంది. కళాప్రపూర్ణ విశ్వంగారు తన కవితలో ఒక చోట చెప్పుకున్నారు.. 'విశ్వరూపి నా హృదయం / విశ్వజీవి నా హృదయం / విశ్వభావి నా హృదయం / విశ్వమేవ నా హృదయం ' అని. ఈ భావాలకి సరైన అన్వయం అనిపించేలా ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దారు సంపాదకులు. 'విశ్వజీవి' అనే మొదటి విభాగం వ్యాస సంకలనం. ఇందులో విశ్వంగారి జీవిత సంగ్రహాన్ని, ఆయన సాహిత్యాన్ని, ఆయనతో గల పరిచయాలను పంచుకునే వ్యాసాలు ఉన్నాయి . కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు, ఆరుద్రగారు, వేలూరి శివరామ శాస్త్రిగారు, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గారు, మాలతీ చందూర్ గారు..లాంటి హేమాహేమీలు విశ్వంగారితోను. ఆయన సాహిత్యంతోనూ తమకి గల అనుబంధాన్ని సవివరంగా వ్రాశారు. విశ్వంగారి గురించి ఎన్నో విలువైన, ఆసక్తికరమైన సంగతులు వీటిల్లో లభ్యమౌతాయి. సంపాదకులు మొదట్లో చెప్పినట్లు వీటిల్లో కొన్నిసార్లు సమాచారం పునరావృతమైనట్లు అనిపించవచ్చు కానీ పాఠకుడిని ఆసక్తి కరంగా చదివించడంలో అది పెద్దలోపం అనిపించదు. 'విశ్వరూపి' విభాగంలో పాత్రికేయ జీవితంలో ఆయన నడిపిన శీర్షికలతో పాటు కొన్ని వ్యాసాలు కూడా ఉన్నాయి. 'విశ్వభావి' అనే విభాగంలో విశ్వంగారు వివిధ సందర్భాల్లో చేసిన ప్రసంగాలు. ఆయన పుస్తకాలకి రాసిన ముందు మాటలు, పుస్తక సమీక్షలు పొందుపరచబడ్డాయి. 'విశ్వమేవ'లో వివిధ సందర్భాలలో విశ్వంగారితో చేసిన ఇంటర్వ్యూలు ఉన్నాయి. 'సమగ్ర గ్రంథం' అనడానికి అన్నివిధాలా అర్హత ఉన్న విలువైన పుస్తకం ఇది. కవిగా, కథకునిగా సంపాదకునిగా, అనువాదకుడిగా, స్వాతంత్ర్య సమరయోధునిగా తెలుగు సాహిత్యానికి, పాత్రికేయ రంగానికి విలువైన సేవలందించిన విద్వాన్ విశ్వంగారి గురించి ఈ తరానికి, ముందు తరాలకు కూడా తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ పుస్తకం ఆ లోటుని తీరుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఒక బృహత్తర కార్యక్రమానికి చక్కటి పుస్తకరూపమిచ్చిన సంపాదకులు అభినందనీయులు. ***

For Copies
K.Murali Mohan
9111, Block 9A
Janapriya Mahanagar,Meerpet
HYDERABAD – 500 097
Phone : 970 137 1256

# పుస్తక పరిచయం




**For Copies:**
**Sahiti Sudha Publications**
**# 360, 2/5 Krishna Nagar**
**GUNTUR – 522 006**
**Cell# : 939 410 0531**

**ఛందస్సుల బందోబస్తులు తెంచుకున్న కవి,** వచనకవితని ప్రాచుర్యంలోకి తెచ్చాక, అందులోనూ అనేక కవితా రీతులు వచ్చాయి. మినీ కవితలు, హైకూలు, నానీలు, నానోలు..ఇప్పుడు సరికొత్తగా 'రెక్కలు'. ఛందస్సులంత క్లిష్టతరమైన నిబంధనలు కాకపోయినా వీటికీ కొన్ని నియమాలు ఉన్నాయి. పాఠకుడికి సరళమైన వచన కవిత చదివే అనుభూతిని ఇస్తూ కాస్త వేదాంతం, ఎంతో వాస్తవికత కలగలిపిన ప్రక్రియే 'రెక్కలు'. దీని సృష్టికర్త సుగమ్‌బాబుగారి మాటల్లోనే చెప్పాలంటే 'రెక్కల కవి ఏదైనా రాసి చదివే పఠితృలోకాన్ని మెప్పించగలగడం అసాధ్యం. 4 ప్లస్ 2 పంక్తుల్లో చివరి రెండు పంక్తులూ తాత్విక కోణంలోనో, ఆధ్యాత్మిక భావనలోనో పోహళింపచేయడంలో కవి అనివార్యమైన ప్రతిభా పాటవాలను ప్రదర్శించగలగాలి. అప్పుడే ఆ కవిత 'రెక్కలు' విప్పార్చుకుని పాఠకునికి హృదయంగమమై భాసిస్తుంది'. కవి సుపాణిగారు ఈ రెక్కలు ప్రక్రియని బాగా ఒడిసి పట్టుకున్నారు. ఒక్కో 'రెక్కలు' కవితనీ ఎంతో హృద్యంగా తీర్చిదిద్దారు. ఎందులోనూ అస్పష్టత, సంక్లిష్టత ఉండదు. ప్రతి కవితా పదే పదే ఉదహరించగలిగేలా ఉంటుంది. ముఖ్యంగా 'రెక్కలు' నిర్మాణాన్ని అనుసరించి ప్రతి కవిత చివరలోనూ వ్రాసిన రెండు పంక్తులు, పఠితల హృదయాలను సూటిగా తాకి ఆలోచింపచేస్తాయి. ఈ కొసమెరుపు పంక్తులు కవితలో భాగమే ఐనా , వాటిని విడిగా తీసి చూసినా సుభాషితం లానో నీతివాక్యంలోనో, మంచి సామెతలానో అనిపిస్తాయి. ఉదా: " సాగదు / ఆగదు / సమస్య / సమసిపోదు / -/ తిరస్కారం / కాదు పరిష్కారం" ; "నిత్యం ఇంట్లో / ఊగే గడియారం / విరామమెరుగక / తిరిగే యంత్రం / - / అమ్మ / అందివచ్చిన వరం" ; 'ఏడుస్తూనే / ఎన్నాళ్ళు?/ నవ్వుతుందాం / చాన్నాళ్ళు/ - / ముగింపు / మృత్యువు" ; "చావూ బ్రతుకుల / మధ్య / సన్నని రేఖ/ జీవితం/ - / మృత్యువు / అగుపడని శత్రువు".. ప్రతి కవితకీ ధీటైన ఆంగ్ల అనువాదం కూడా పాఠకులని ఆకట్టుకుంటుంది. అందమైన ముద్రణ, వినూత్నమైన రూపకల్పన కూడా ఈ 'రెక్కలు' సంకలనాన్ని పాఠకులలో ఆసక్తిని రేకెత్తిస్తాయి. సరదాగా చదివిస్తూనే ఆలోచింపచేయడంలో కవి 'సుపాణి'గారు పూర్తిగా సఫలీకృత్యులయ్యారు. చక్కటి ప్రయత్నం, చక్కటి రచన, చక్కటి సంపుటి.

**




**కొంచెం అరుదుగా తారసపడే** విలక్షణమైన కథా సంపుటి ఇది. ఇందులోని కథా వస్తువులన్ని మనం తరచు వార్తాపత్రికల్లో చదివే వార్తల్లోంచి వచ్చినవీ లేదా , మారుతున్న సామాజిక, ఆర్థిక వాతావరణంలో ఎదురయ్యే సంఘటనల్లోంచి వచ్చినవీ. వాస్తవం పాళ్ళు ఎక్కువ, కాల్పనికత శాతం చాలా తక్కువ. యదార్థ సంఘటనలని కథలుగా మలచడంలో రచయిత ఎం. వెంకటేశ్వర రావుగారికి ప్రత్యేకమైన నేర్పు ఉందన్న విషయం ఈ కథా సంపుటిని అక్కడక్కడా చదివినా తెలిసిపోతుంది. రచయితే తన ముందు మాటలో చెప్పారు "రచన ఒక సామాజిక బాధ్యత. రచనల్లో వ్యక్తిగతానికి, స్వగతానికి తావుండరాదు. రచయితకి "ఎందుకు రాస్తున్నాను?", "ఎవరికోసం రాస్తున్నాను?", "ఎవరికి చెప్పాలని రాస్తున్నాను?" వంటి విషయాలపై అవగాహన కల్గి ఉంటేనే "ఎలా చెప్పాలి?" అనే మధన మొదలౌతుంది. నా కథలన్నీ అటువంటి మథనంలో నుండి పుట్టినవే!" అని. ఇంత స్థిరమైన అభిప్రాయాలతో సాగిన రచనలు కాబట్టే ఇందులో నేలవిడిచి సాము చేసే కథలు కానీ, పాత్రలుకానీ, సంఘటనలు కానీ, సంభాషణలు కానీ ఉండవు. రచనాశైలి సరళంగా, సులభంగా సాగిపోతుంది. పాఠకుడికి ఎక్కడా విసుగుకలిగించదు. చాలా కథల విషయంలో ప్రారంభంలోనే ముగింపు ఊహించడం కష్టతరం ఏమి కాదు. ఐనా చివరంటా చదవాలనిపిస్తుంది. చదువుతున్నంతసేపూ ఆయా సన్నివేశాలకి మనమూ ప్రేక్షకులమే అన్న భావన కలుగుతుంది. ఇక్కడ రచయిత తాను నమ్మిన సిద్ధాంతానికి న్యాయం చేకూర్చారని నిస్సందేహంగా చెప్పవచ్చు. డాక్టర్ల సమ్మె, పిల్లలపై తమ అభిప్రాయాలని రుద్దే తల్లిదండ్రులు, అమ్మా నాన్నలని నిర్లక్ష్యం చేసే సంతానం, ప్రియుడితో వెళ్ళిపోదామనుకుని తిరిగొచ్చిన కుమార్తె, కన్నబిడ్డల్లాంటి విద్యార్థినులపై అత్యాచారాలు చేసే గురువులు, మూఢనమ్మకాలు, కరెంటు కోతలకి ఎండిపోయిన మోటార్లు, బీడు వారిన పొలాలు... ఇవీ రచయిత ఎంచుకున్న కథా వస్తువులు. పుస్తకం అంతా చదివితే ఒక్కసారి సమకాలీన సమాజంలోని సమస్యాపూరిత కోణాలన్నింటినీ ఒక్కసారి స్పృశించినట్లుంటుంది. "ఏతమేసి తోడినా!" కథని ఈ సంపుటికి హైలైట్‌గా పేర్కొనవచ్చు. నాలుగు పరిచయ వాక్యాలని పెద్దిభొట్ల సుబ్బరామయ్యగారు, ఆప్తవాక్యాన్ని ఎ.ఎస్.లక్ష్మిగారు అందించారు. సాహిత్యానికి సామాజిక ప్రయోజనమే పరమావధి అని నమ్మే ప్రతి పాఠకుడికి నచ్చితీరుతాయి ఇందులోని కథలన్నీ. రచయితకి అభినందనలు.

**

*ADDRESS:*

**M. Venkateswara Rao**
"SRI SAI SUNDAR"
H.No: 19-14, 15 &16
T2 TARA MANSION
KOTHA BASTHI
West, Venkatapuram
Alwal; Secunderabad- 500 015
Ph. No. 9666562422
e-mail : mvr.yellow@yahoo.com

**For Copies**
**Visalandhra Publications**
**Telugu Book Depot**
**Navodaya Book Depot**

# పుస్తక పరిచయం




*Published by:*
**Lipi Publications**
**Gandhi Nagar**
**Hyderabad – 500 080**
**Phone: 040-761 2244**
**Cell: 98490 22344**

**"ప్రయాణించే సమయం ఉంటే ఏ ప్రదేశమైనా చేరువలోనే ఉన్నట్లనిపిస్తుంది"** అనే నానుడి ఎక్కువగా ప్రయాణాలు చేసేవారికి బాగా వర్తిస్తుంది. తెలుగులో యాత్రాసాహిత్యం చాలా తక్కువ అనే విషయం ఎవరూ కాదనలేని సత్యం. యాత్రాసాహిత్యాన్ని విజ్ఞాన, వినోద, వికాస పూరితంగా తీర్చి దిద్దాలంటే ప్రయాణించే వారి దృష్టి, చూసే ప్రదేశాల విశ్లేషణా ప్రత్యేకంగా ఉండాలి. వారు ప్రొఫెషనల్ రైటర్ కూడా ఐనప్పుడు ఆ ట్రావెలోగ్ పాఠకులందరినీ పదికాలాలు అలరిస్తుంది.తన ఏడవ ట్రావెలోగ్ ద్వారా మల్లాది వెంకటకృష్ణమూర్తిగారు ఈ విషయాన్ని మరోసారి ఋజువుచేశారు. క్రిందటి సంవత్సరం పదకొండు రోజులపాటు తూర్పు ఐరోపాదేశాలైన తూర్పు జెర్మనీ, చెక్ రిపబ్లిక్, స్లోవేకియా, ఆస్ట్రియా, హంగరీ, పోలాండ్ దేశాలని చుట్టివచ్చిన ఆంధ్రుల ఆహ్లాద రచయిత మల్లాదిగారి మరో విశిష్ట రచన ఈ 'ట్రావెలాగ్ ఈస్టర్న్ యూరప్''. మల్లాదిగారి రచన అనగానే సరళమైన శైలిలో, ఏ విషయాన్నైనా అతి సులువుగా, అందంగా, ఆసక్తికరంగా అందిస్తారని తెలుగుపాఠకులందరికీ తెలుసు. ఈ పుస్తకం కూడా మొదటి పేజీ నుంచి చివరి పేజీ వరకూ ఆపకుండా చదివింపచేస్తుంది. ఇంట్లో బయలుదేరిన వద్దనుంచి అంతర్జాతీయ విమానం ఎక్కేదాకా, ఆ తర్వాత తను చూసిన ప్రదేశాల గురించి, ఎదురైన వ్యక్తులు, సన్నివేశాలని అత్యంత విశదంగా పాఠకుడిని చేయి పట్టి తనతో తీసుకెళ్ళినట్లు వివరిస్తారీ పుస్తకంలో. అవసరమైన చోట్ల చారిత్రక వివరాలని అవసరమైనంత మేర ఇచ్చి పాఠకులకి విజ్ఞానాన్ని కూడా అందించడం ఈ పుస్తకం మరో ప్రత్యేకత. పోలెండ్ లోని ఔష్ విట్ కేంప్ లాంటి ప్రదేశాల వివరాలు వ్రాసేప్పుడు సమయోచితంగా చిన్న చిన్న కథలు కూడా చెప్పారు. ఆయా ప్రదేశాలు చూడాలనుకునే వారికి చక్కటి గైడ్‌లా ఉపయోగపడుతుందీ పుస్తకం. ఇప్పటికే చూసేసిన వారికి కూడా భిన్నకోణంలో ఆయా ప్రదేశాలని ఎలా చూడొచ్చో తెలుస్తుంది. 200 పేజీల పుస్తకంలో 20 పేజీల వర్ణచిత్రాలు కూడా ఉన్నాయి. ఓ ఆత్మీయమైన మిత్రుడు పక్కన కూర్చుని ఆయా విశేషాలన్నింటినీ మనసు విప్పి మనతో పంచుకున్న అనుభూతిని కలిగిస్తుందీ ట్రావెలోగ్. ఆ కళ మల్లాదిగారికి మాత్రమే సొంతం అనడంలో ఏమాత్రం అతిశయోక్తిలేదు.

**




***Published by :***
***Sarada***
***Sruthy Art Academy***
***#211, Range View Apartments***
***Rethi Bowli, Mehdipatnam***
***Hyderabad – 500 011***
***Email: sruthakirthy@yahoo.co.in***

**భరతనాట్య కళారంగంలో** విశేష ఖ్యాతి నార్జించిన నర్తకీమణి డా.పద్మా సుబ్రహ్మణ్యంగారి జీవిత చరిత్ర ఈ పుస్తకం. డా.పద్మా సుబ్రహ్మణ్యం గారు కేవలం భరతనాట్య కళాకారిణిగానే మిగిలిపోకుండా ఆ నాట్యరంగంలో విశేష పరిశోధనలు చేసి, అందులో ఎన్నో కొత్త ప్రయోగాలు చేశారు. సరికొత్త అంశాలు జోడించి భరతనాట్యానికి కొత్త సొగసులు అద్దారు. ఆలాంటి విశిష్టమైన కళాకారిణి జీవిత చరిత్రకు గ్రంధరూపం ఇవ్వడమంటే అందరికీ సాధ్యపడే పని కాదు. ఎందుకంటే ఒక కళాకారిణి జీవితంలోని అనుభవాలని, ప్రయోగాలని సరిగ్గా వర్ణించాలన్నా, విశ్లేషించాలన్నా మరో కళాకారిణికే సాధ్యమౌతుంది. ఐతే అలాంటి కళాకారిణి రచయిత్రికూడా ఐనప్పుడే ఆ కృషికి పరిణితి లభిస్తుంది. అంత పరిణితితో ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దిన చిన్నారి, కుమారి పి.శ్రుతకీర్తిని ఎంతైనా అభినందించాలి. హైదరాబాదులో ఏ ప్రతిష్ఠాత్మకమైన సాంస్కృతిక కార్యక్రమానికి వెళ్ళినా శ్రుతకీర్తి స్వరం వినిపిస్తుంది. తన మధుర గంభీర స్వరంతో ఎన్నో కార్యక్రమాలకి వ్యాఖ్యాతగా వ్యవహరించి 'వ్యాఖ్యాన విపంచి'గా పేరు పొందింది శ్రుతకీర్తి. భరతనాట్య కళాకారిణిగా, టి.వి.ప్రయోక్తగా, ప్రముఖ నాట్యకళాకారులను ఇంటర్వ్యూ చేసిన పాత్రికేయురాలిగా, అతిచిన్న వయసులోనే బహుముఖ ప్రజ్ఞత్వాన్ని ప్రదర్శిస్తున్న శ్రుతకీర్తి కలంనుంచి వెలువడింది ఈ పుస్తకం. ఈ జీవిత చరిత్రని కేవలం తేదీలు, సంఘటనలకి పరిమితం చేయకుండా డా.పద్మగారి కళా జీవితాన్ని విశ్లేషిస్తూ, ఆమె సాధించిన విజయాల వెనుకనున్న కృషిని వివరిస్తూ తనదైన శైలిలో ఈ పుస్తకాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దారు రచయిత్రి. భరతనాట్యంలో భంగిమలు అన్న భావనకు కాస్త విలక్షణమైన 'కరణాలు' అనే భావనని వివరిస్తూ 108 కరణాల లక్షణాలని బొమ్మలతో సహా వివరించడం ఇంకొక విశేషం. అరుదైన ఛాయాచిత్రాలు ఈ పుస్తకానికి అదనపు ఆకర్షణ. భవిష్యత్తులో శ్రుతకీర్తి కలం నుంచి మరిన్ని మంచి గ్రంధాలు రావాలని కౌముది మనసారా ఆశిస్తోంది.



# పుస్తక పరిచయం




*Published by:*
**Lipi Publications**
**Gandhi Nagar**
**Hyderabad – 500 080**
**Phone: 040-761 2244**
**Cell: 98490 22344**

**పసిపిల్లల మనసులు** అతి సున్నితమైనవి. 7 - 14 సంవత్సరాల వయసులోని పిల్లలకి అప్పుడప్పుడే లోకం అర్థమవుతూ ఉంటుంది, అర్థమైనట్లే ఉన్నా చాలాసార్లు సరైన అర్థం దొరకదు. ఆ వయసులో వాళ్ళ ఆలోచనలని సక్రమమైన మార్గంలో పెట్టగలిగితే భవిష్యత్తులో వాళ్ళు బాధ్యతగల పౌరులుగా తయారౌతారు. సమాజ వికాసానికి అది పునాది. పిల్లల మనసుల్ని ఆకట్టుకోడానికి సులభమైన మార్గం కథలు చెప్పడం. నిత్యజీవితంలోని సంఘటనలని, పాత్రలని తీసుకుని చిన్న చిన్న కథలుగా మలచి అంతర్గతంగా ఓ నీతిని, మార్గదర్శక సూత్రాలనీ కలిపి అందిచడం, ఓ అద్భుతమైన ప్రక్రియ. ఇందుకు నూటికి నూరు శాతం దోహదపడేవే ఈ పుస్తకంలోని కథలు. ఆంధ్రుల ఆహ్లాద రచయితగా తిరుగులేని ఖ్యాతిని సంపాదించుకున్న మల్లాది వెంకట కృష్ణమూర్తిగారి కలం నుంచి వెలువడిన ఆణిముత్యాలు ఈ పిల్లల హిత కథలు. గత 40 సంవత్సరాలు పైగా కథలు, నవలలు, ట్రావెలోగ్స్, గత కొన్నేళ్ళుగా ఆధ్యాత్మిక గ్రంధాలు..ఇంకా హాస్య కథలు, వంటల పుస్తకాలు, క్రైం కథలు, అనువాదాలు.. ఏది వ్రాసినా తనదైన ముద్ర నిలుపుకుంటున్నారు మల్లాదిగారు. ఇన్నేళ్ళుగా పాఠకుల ఆకర్షణ కోల్పోకుండా వ్రాయడం ఆయనకొక్కరికే సాధ్యపడింది. ఆ కోవలోకి చెందినవే ఈ పిల్లల కథలు కూడా. సరళమైన శైలే మల్లాదిగారి రచనలకి అలంకారం. ఇందులోని కథలకూ అదే ముఖ్య ఆకర్షణ. మల్లాదిగారు రచయితగా తొలి అడుగులు వేసింది 'చందమామ' కథల ద్వారానే అని ఓసారి గుర్తు చేసుకోవాలి. ఈ పుస్తకంలోని ఏ కథా ఒకటి రెండు పేజీలను మించదు. ప్రతి కథకి చివర చక్కటి ఆంగ్ల సూక్తిని పొందుపరిచారు. పెద్దలు కూడా చదివి మరోసారి మననం చేసుకోవాల్సిన, వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన ఆలోచనలూ చాలా ఉన్నాయి ఈ కథల్లో. పిల్లలకి, పిల్లలు కల పెద్దలకీ వెలలేని కానుక ఈ పుస్తకం.'మంచి ప్రవర్తన అనే భవంతికి మంచి ఆలోచనలు పునాది రాళ్ళు. పునాది బలంగా ఉంటే, భవంతి కూడా స్థిరంగా ఉంటుంది. ఈ పుస్తకంలోని కథలన్నీ మంచి ఆలోచనలని అందించేవే' అని రచయిత ముందు మాటలో పేర్కొన్నారు. మంచి పుస్తకమే కాదు, మంచి కథ, మంచి వాక్యమూ కూడా మంచి స్నేహితుల్లాంటివే అని ఋజువు చేశారు మల్లాదిగారు.***




**_Published by :_**
**_V-Tech Publications_**
**_Shop# 14, Film Nagar Society_**
**_Jubilee Hills_**
**_HYDERABAD – 500 096_**
**_Phone: 040-2354 8444_**

**కొత్తగా పరిచయం అవసరంలేని** సినీ రచయితలు పరుచూరి బ్రదర్స్. గత 34 సంవత్సరాలుగా తెలుగు సినీ పరిశ్రమలో తమ విజయకేతనాన్ని ఎగరవేస్తూ దాదాపు 350 సినిమాలకి రచన చేశారు పరుచూరి వెంకటేశ్వరరావు, పరుచూరి గోపాలకృష్ణ. కేవలం రచయితలగానే కాక కొన్ని సినిమాలకి దర్శకులుగా, మరికొన్ని సినిమాల్లో నటులుగా కూడా తెలుగు ప్రేక్షకుల మనసుల్లో స్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నారు ఈ సోదరద్వయం. సినిమా రచనకి, రచయితకి హీరోయిజాన్ని ఆపాదించిన ఖ్యాతి పరుచూరి బ్రదర్స్‌కే దక్కుతుంది. సినిమారంగంలో ఎక్కువమంది రచయితలు వీరి శిష్యరికంచేసిన వారే కావడం గమనార్హం. తెలుగు సినిమా కుటుంబగాథా చిత్రాల ఒరవడినుంచి వాణిజ్యపరమైన మార్గంలోకి నడుస్తున్న సంధి సమయంలో చిత్రరంగం ప్రవేశించిన పరుచూరి బ్రదర్స్ జీవితం, నల్లేరు మీద నడక గాదు. వివిధ హీరోలతో తమకున్న పరిచయాలు ముఖ్యాంశంగా వెలువడిన ఈ పుస్తకం మొదట్లోనే తమ నేపథ్యం గురించి, సినిమాల్లో పేరు తెచ్చుకునే వరకూ పడిన కష్టాల గురించి ఏమాత్రం భేషజం లేకుండా వివరంగా వ్రాసుకున్నారు. ఒక స్థాయికి చేరుకున్నాక చాలా మందికి బాధాకరమైన గతం గురించి గుర్తుచేసుకోవడం ఇష్టం ఉండదు,. అలా కాకుండా తమ ప్రయాణంలోని ఆటుపోట్లని ఉన్నవి ఉన్నట్లుగా వ్రాసుకున్న ఈ సోదరుల నిజాయితీని అభినందించాలి. ఎన్టీ రామారావు గారితో మొదలుకుని మహేష్‌బాబు వరకూ తాము పనిచేసిన హీరోల సినిమా నిర్మాణంలోని అనుభవాలని చాలా వివరంగా వ్రాశారు. మూడు తరాల హీరోల సినిమాలకి రచన చేసి, వారికి విజయాలనందించడంలో ప్రధాన పాత్ర వహించిన అరుదైన అవకాశం ఈ బ్రదర్స్‌కే సొంతం. ప్రతి హీరో గురించి వ్రాసినప్పుడు - పరిచయం నుంచి మొదలుకుని ఒక్కో సినిమా రచనలో కలిగిన అనుభవాలని కళ్ళకి కట్టినట్లు వ్రాశారు. ప్రతి చిన్న విషయాన్ని వివరంగా వ్రాయడం వల్ల ఒక్కో సంఘటన చదువుతుంటే రచయితలతో కలిసి పాఠకులూ అక్కడ ఉన్న అనుభూతి కలుగుతుంది. కొన్ని కథలు ఎలా తయారైందీ, మధ్య మధ్యలో ఎలాంటి మార్పులు చేర్పులకి లోనైందీ, కొన్ని సంభాషణలు వ్రాయడం వెనుకనున్న నేపథ్యాలూ చాలా ఆసక్తికరంగా వివరించారు. ఒక్కో అధ్యాయం చదువుతుంటే గత 34 సంవత్సరాల తెలుగు చలన చిత్ర పరిశ్రమలోని అనేక విజయవంతమైన సినిమాలని ఆమూలాగ్రం సమీక్షించినట్లనిపిస్తుంది. సినిమాల నేపథ్యం మీద ఆసక్తి ఉన్న పాఠకులకి విందు భోజనం లాంటిది ఈ పుస్తకం. ***



# పుస్తక పరిచయం




*Writer:*
**Kakaraparti Durga Prasad**
**2-121/1 Indrapalem**
**KAKINADA**

**ప్రస్తుతం** 'కౌముది'లో 'పునరపి జననం' అనే సీరియల్ నవల వ్రాస్తున్న కె.బి.కృష్ణగారు హడావిడి, గందరగోళం లేని రచయిత. పెద్ద పెద్ద ఉపన్యాసాలూ, సందేశాలూ, సంక్లిష్టమైన పదప్రయోగాలూ - ఇలాంటివేమీ లేకుండా చక్కటి సరళమైన భాషలో చెప్పదలచుకున్న విషయాన్ని సూటిగా పాఠకులకి అందించడంలో మెలకువలు తెల్సిన మంచి రచయిత కృష్ణగారు. ఆయన వ్రాసిన కథల గురించిన లఘుపరిశోధనా పుస్తకమే ఈ 'కె.బి.కృష్ణ కథలు - ఒక పరిశీలన'. ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలైన కాకరపర్తి దుర్గాప్రసాద్‌గారు తమ ఎమ్.ఫిల్ కోసం వ్రాసిన సిద్ధాంతగ్రంథం ఇది. కథలని దుర్గాప్రసాద్ గారు విశ్లేషించే విధానం బహుప్రశంసనీయం. ప్రతి కథనీ విశ్లేషించడానికి ముందుగా కథాంశాన్ని అతి సులభమైన వాక్యాలలో పాఠకులకి పరిచయం చేశారు. తర్వాత అందులోని అంతర్గత సందేశాన్ని, రచయిత చెప్పదలచుకున్న విషయాలని వివిధ కోణాలలో విశ్లేషించారు. ఒక్కోసారి రచయిత వ్రాసేప్పుడు కూడా చూడని కోణాలు ఇలాంటి సునిశిత విశ్లేషణ ద్వారా బయటికి వస్తాయి. ఇందువల్ల కూడా పాఠకులకి తమంత తాము చదివినప్పుడు గోచరించని అంశాలు ఇలాంటి పరిశోధనా వ్యాసాల ద్వారా బహిర్గతమౌతాయి. ఈ ప్రక్రియలో పరిశోధకులు దుర్గాప్రసాద్‌గారు పూర్తి విజయం సాధించారని చెప్పడంలో ఏమాత్రం సంకోచించాల్సిన అవసరం లేదు. రచయిత కె.బి.కృష్ణగారి మూడు కథాసంపుటాలు (ఆ)గాయత్రి (2)ఆమెనవ్వింది (3)అనుబంధాలు. వీటిలోని కథలని కుప్తంగా పరిచయంచేశారు మొదటి అధ్యాయంలో. ఆ తరువాత ఈ కథలని కథాంశాలని బట్టి వివిధ వర్గాలుగా విభజించి మరింత లోతుగా విశ్లేషించారు తరువాతి అధ్యాయంలో. ఆత్మీయానురాగాలను ప్రతిబింబించే కథలు, అపోహలూ, అపార్థాలూ, కార్యాలయ సంబంధమైన కథలు, సినీ అభిమానులు..ఇలా ఈ కథల వర్గీకరణ కొనసాగింది. తరువాత అధ్యాయంలో పాత్రల పరంగా మరో కోణంలో కథలని విశ్లేషించారు. కేవలం పొగడ్తే విశ్లేషణ అనిపించకుండా, అవసరమైన చోట్ల మొహమాటం లేకుండా ఈ కథ ('పెళ్ళంటే..) కొంత ఆవేశానికి లోనై వ్రాసిన కథ అనిపిస్తుంది, 'ముగింపు అతిశయోక్తిగా అనిపిస్తుంది' అని నిష్పక్షపాతంగా చెప్పారు. ఆద్యంతం అత్యంత ఆసక్తికరంగా సాగిన ఈ పరిశోధనా గ్రంథం చదివాక ఆయా కథల మాతృకలు చదవాలని అనిపిస్తుంది. ఇందుకు మూల రచయిత కృష్ణగారి రచనలు ఎంత కారణమో దూర్గాప్రసాద్ గారి విశ్లేషణ కూడా అంతే కారణం. పుస్తకం మొదట్లో కె.బి.కృష్ణగారి జీవిత చిత్రాన్ని పరిచయం చేయడం కూడా రచయిత నేపథ్యాన్ని అర్థం చేసుకోవడానికి తోడ్పడుతుంది. తెలుగులో ఇలాంటి పరిశోధనా గ్రంథాల ఆవశ్యకత ఎంతైనా ఉంది. ***




**For Copies :**
**Media House Publications**
**1-9-289/4 Behind Post Office**
**Vidyanagar,Hyderabad – 500 044**
**Phone: 040-2760 7307**

**'కదిలేదీ,** కదిలించేదీ, పెనునిద్దర వదిలించేదీ, పరిపూర్ణపు బతుకిచ్చేదీ, కావాలోయి నవకవనానికి' అని శ్రీశ్రీ కవిత్వం గురించి చెప్పినా, మొత్తం సాహిత్యానికీ, సాహిత్యంలోని ఏ ప్రక్రియకైనా ఈ మాటలు వర్తిస్తాయని చెప్పుకోవచ్చు. ఆది కవి దగ్గరనుంచి ఇప్పటివరకూ తెలుగులో , వివిధ ప్రక్రియల్లో లక్షలాది రచనలు వచ్చి ఉంటాయి. వాటిల్లో పదికాలాలు నిలిచేవి, చదివినంతసేపే కాక తర్వాత కూడా ఆలోచింపచేసేవీ ఎన్ని అంటే - కాలమే సమాధానం చెప్పింది, చెబుతోంది, చెప్పబోతోంది. పాఠకులు మర్చిపోయేవన్నీ కేవలం కాలక్షేప రచనలో, పసలేని రచనలో ఐ ఉంటాయి. కథకానీ, నవలకానీ, వ్యాసం కానీ, నాటకం, నాటిక, గేయం, కవిత ..ఏదైనా మనసుకి హత్తుకుని, మనసుని కదిలించి మెదడుకి పనిపెట్టేది ఐతే అది కాలపరీక్షని తట్టుకుని నిలబడుతుంది. ఇలాంటి రచనలు చదువుతున్నప్పుడు...ముఖ్యాంశంతో బాటు..మధ్య మధ్యలో పాత్రలో, రచయితో చెప్పే వాక్యాలు ఒక్కసారి భుజం తట్టి నిలబెడతాయి. ఆలోచించమంటాయి, ఆలోచనల్లో మిగిలిపోతాయి. పుస్తకం మూసేశాక కూడా వెంటాడుతుంటాయి. కొన్నిసార్లు రచన మొత్తం బావుండకపోయినా ఇలా కదిలించే వాక్యాలు బాగానే ఎదురవ్వొచ్చు. అలాంటి వాక్యాలే నీతి సూక్తులుగా, జనోక్తులుగా, 'కోటబుల్ కోట్స్'గా మిగులుతాయి. తరం నుంచి తరానికి పయనిస్తూ ఉంటాయి. అలాంటి మరవరాని మాటల సంకలనం ఈ పుస్తకం. మిగతా భాషల సంగతి తెలీదుకానీ, తెలుగులో ఇలాంటి పుస్తకం రావడం ఇదే మొదలు. ఏవో నీతి సూక్తులు, ఒక రచయిత రచనల్లోని మంచి మాటలు సంకలనాలుగా వచ్చాయి కానీ మొత్తం తెలుగు సాహిత్యంలోనుంచి (అప్పటి నుంచి ఇప్పటి దాకా) ఇలాంటి వాక్యాలని ఏరి నిఘంటువు రూపంలో కూర్చడం ఇదే ప్రథమం. తెలుగు భాషకి ఎనలేని సేవచేసిన డా.బూదరాజు రాధాకృష్ణగారి విశిష్ట కృషికి పుస్తకరూపం ఇది.. ఇందులోని వాక్యాలు - అంశం వారీగా వర్గీకరించబడ్డాయి. అంటే తెలుగు, తెలివి. తెలిసిన వాళ్ళు..ఇలా. మళ్ళీ అవన్నీ అకారాది క్రమంలో పూర్తి స్థాయి నిఘంటువు రూపంలో అందించారిందులో. ప్రతి వాక్యానికీ రచయితపేరుని పేర్కొనడమే కాక, పుస్తకం చివరలో మళ్ళీ అందరు రచయితల పేర్లనీ పొందుపరిచారు. తెలుగుసాహిత్యంలో ఇదొక అద్భుతమైన ప్రయోగం. ప్రయోజనాత్మకమైన ప్రయోగం. ఈ పుస్తకం లోపలి కవర్ మీద వ్రాసిన ఈ వాక్యాలు నూటికి నూరుశాతం నిజం,,! " సాహిత్యాభిమానాన్ని , సంభాషణ చాతుర్యాన్ని ప్రదర్శించదలచిన సహితీ పరులకిది అమూల్యమైన సహకారి!". అజ్ఞాత రచయితలతో సహా దాదాపు 500 మంది రచయితలు రాసిన 5000 గ్రంథాలనుంచి సేకరించిన మరవరాని మాటలున్నాయి. భిన్న రచనల్లో, భిన్న పాత్రలద్వారా, భిన్న సందర్భాల్లో రచయితలు వెలిబుచ్చిన విలక్షణాభిప్రాయాలు 2500 శీర్షికల కింద కనిపిస్తాయి. ***

# పుస్తక పరిచయం




**తెలుగు సాహిత్యంలో** 'శారద'ది ఒకప్రత్యేక స్థానం. 'శారద' అంటే చాలామంది తెలుగు పాఠకులకి తెలియకపోవడం ఆశ్చర్యకరమైన విషయమేమీ కాదు. 1955 లోనే ఆయన చనిపోవడం ఒక కారణమైతే, ఏ సాహితీ వర్గమూ ఆయన్ని తన ప్రతినిధిగానో, సభ్యుడిగానో పరిగణించి ప్రచారం చేయకపోవడం మరొక కారణమై ఉండవచ్చు. 'శారద' కలం పేరుతో కథ, నవల, నాటిక, వ్యంగ్యకథనం..లాంటి సాహితీప్రక్రియల్లో తనదైన ముద్రవేసిన నటరాజన్ జీవితం, వ్యక్తిత్వ వికాస విశ్లేషకులకి ఒక అధ్యయన గ్రంథం లాంటిది. ఒక పక్క కటిక దరిద్రం, మరోపక్క అనారోగ్యం ఆ అనారోగ్యం కూడా ఎప్పుడు, ఎక్కడ ఏ స్థితిలో హఠాత్తుగా పడిపోతాడో ఊహించలేని మూర్ఛరోగం. పడితే, దేహానికి గాయాలై మరోబాధని కల్పించే అవకాశం ఉన్న జబ్బు. తెలుగులో ఎలాంటి ఫార్మల్ విద్యాభ్యాసం లేకుండానే- తెలుగు సాహితీ సంద్రంలో అనర్ఘరత్నాలని సృష్టించిన ఘనుడు 'శారద'. తమిళం మాతృభాషగా పెరిగిన నటరాజన్ పదమూడేళ్ళ వయసులో తెనాలిలో అడుగుపెట్టాడు. తెలుగులో అక్షరం ముక్కరాదు. ఆ తరువాత తొమ్మిదేళ్ళపాటు తెలుగు నేర్చుకోవడానికి నానా కష్టాలు పడ్డాడు. తన 22వ యేట మొదటి రచన చేశాడు. మరో తొమ్మిదేళ్ళపాటు ఉధృతంగా రచనలు చేసి 31 సంవత్సరాలకే నూరేళ్ళూ నింపుకున్నాడు 'శారద'. ఆయన జీవన యానమే ఈ పుస్తకం. ప్రముఖ రచయిత, సాహితీ విమర్శకులు విహారిగారు ఈ 140 పేజీల పుస్తకంలో 'శారద' విశ్వరూపాన్ని సందర్శింపచేశారు. 'శారద' వ్యక్తిగత జీవిత విశేషాలతో మొదలుపెట్టి, ఆయన రచనల్లో చాలా వాటిని స్థూలంగా పరిచయం చేసి, విశ్లేషించి, అనుబంధంలో 'శారద' గురించి వివిధ సందర్భాల్లో వచ్చిన వ్యాసాలని కూడా జతచేశారు.

సమస్తజీవితం గాయాల మయమై ఎన్నెన్నో నిరాదరణలకు, హేళనలకూ గురవుతూ ఎన్నో వత్తిళ్ళలోంచి, దుఃఖంలోంచి జీవితపోరాటమే సాహిత్యంగా, సాహిత్యమే జీవితంగా పలవరించిన 'శారద' గురించి ఈ తరం సాహితీప్రియులు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకు చక్కటి సాదనం ఈ పుసకం. . ***

*Published by:*
**CP Brown Academy**
**53, Nagarjuna Hills**
**Hyderabad – 500 082**
**Phone: 040-23430448**




**ప్రవాస భారతీయ రచయితల్లో** అత్యధిక విద్యార్హతలు, పట్టాలు పొందిన రచయిత్రి డా.శారదాపూర్ణగారు ఒక్కరేననడంలో అతిశయోక్తిలేదు. తెలుగు, సంస్కృత సాహిత్యాలలో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఇంకా డి.లిట్ కోసం శ్రమిస్తున్నారు. లలిత సంగీత కచేరీలు, రచనలు, పరిశోధనాత్మక వ్యాసాల్లో ప్రావీణ్యం, తనదైన ప్రత్యేకత సంపాదించుకున్నారు. అనేక గ్రంధాలు రచించారు. తెలుగు-ఆంగ్ల కవితల సంపుటిని వెలువరించారు. గత కొన్ని దశాబ్దాలుగా అమెరికాలో నివసిస్తూ ఇవన్నీ సాంధించడం డా.శారదాపూర్ణగారికి మాత్రమే సాధ్యపడింది. వీరు వ్రాసిన మరొక విలక్షణ గ్రంధం ప్రతీచి లేఖలు. ప్రతీచి, వైయాసిల మధ్య సాగిన లేఖాపరంపర ఇది. వైయాసి నివాసం జంబూద్వీపంలోని కృష్ణాతీరం ఐతే, ప్రతీచి క్రౌంచద్వీపానికి వలసవచ్చి జీవనయానం సాగిస్తున్న వ్యక్తి. శారదాపూర్ణగారి ఆలోచనల్లోని వైలక్షణ్యం ఈ లేఖల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. జిజ్ఞాస జీవంగా నడచిన ఈలేఖల్లో ఎన్నెన్నో కొత్తవిషయాలు మరింత వినూత్నంగానూ, మామూలు విషయాలు సరికొత్తకోణాల్లోనూ చర్చించబడ్డాయి. వైయాసి ఒక లేఖలో వ్రాస్తాడు ' వేదాంతార్థం తెలియాలంటే వేటే దృష్టి కావాలి. అఖండ దృష్టి కావాలి. భౌతికశాస్త్ర దృష్టికి పూర్తిగా వ్యతిరేకమన్నమాట.' అని. గాఢమైన తాత్విక చింతన, తార్కిక సమాలోచన ఈ లేఖల అంతరార్థం. మరోచోట ' మన భావాలు మారుతాయి. వాటికనుగుణంగా అన్నీ మారుతాయి. చూసే వస్తువులు మారుతాయి. మనదృష్టిమారుతుంది. మనం చూసే దృశ్యాలు మారుతాయి. అనుభూతి మారుతుంది. ఇంద్రియాలకందే సర్వం అలా మారుతూనే ఉంటుంది. కారణం ఏమిటి? మొదలెక్కడ? మార్పెక్కడ జరుగుతోంది?'. ఆలోచనల లావా పొంగి ప్రవహించిన సరికొత్త సాహితీ స్రవంతి ఈ 'ప్రతీచి లేఖలు..' పుస్తకం.!

*For Copies :*

*SONTY Publications*
*3042 Carmel Drive*
*Flossmoor, IL USA*
*Phone: 708 957 4302*



# పుస్తక పరిచయం




**మన 'కౌముది'లో** గత 4 సంవత్సరాలుగా నిరాటంకంగా వెలువడుతున్న 'కాలమ్ దాటని కబుర్లు' గల్పికల మొదటి సంపుటి ఈ పుస్తకం. నవ్వించడం ఒక్కోసారి అంత కష్టం అనిపించదు కానీ, ఆరోగ్యకరంగా నవ్వించడం అంత తేలికేమీ కాదు. నవ్విస్తూ మనసుని సున్నితంగా తట్టి 'గుండె తడి' చేయడం రమణిగారి ఈ వ్యాసాల ప్రత్యేకత. ఈ శీర్షికలో రమణిగారు వైవిధ్యమైన అంశాలని మనతో పంచుకున్నారు. సాహితీ సదస్సులు, అమెరికా విశేషాలు, టి.వి.సీరియళ్ళలో స్త్రీ పాత్రలు, చిన్నపిల్లల రియాల్టీ షోలు, పని మనుషులు, డ్రైవర్లు, ఉత్తరాలు, వేసవి శెలవలు, పెళ్ళిళ్ళు నాడు-నేడు , రైలు ప్రయాణాలు, సినిమా రచనలు..ఇవన్నీ ఒక ఎత్తైతే వారి బామ్మ, అమ్మ, అన్నయ్య.. మొదలైన కుటుంబసభ్యుల గురించి వ్రాసిన ఆర్టికిల్స్ ఇంకో ఎత్తు. వాళ్ళ గురించి చదివాక వాళ్ళంతా మన బంధువులైపోతారు. అది రమణిగారి రచనా శైలి ప్రభావం.

ముఖ్యంగా 'అన్నయ్య' గురించి వ్రాసిన ఖండిక చదివిన ప్రతిసారీ కళ్ళు చెమరుస్తాయి. అన్నా, చెల్లెళ్ళ బంధాన్ని అంత సున్నితంగా వ్రాయడం రమణిగారికే చెల్లింది. "నాకు ఎవరి మీద కోపం వచ్చినా వాడి వీపు మీద గిచ్చేసి కొరికేస్తుంటే, అమ్మతో చెప్పకుండా పళ్ళు బిగబట్టి భరించిందీ వాడే, నాకు లెక్కలు రాక తక్కువ మార్కులు వస్తే అందరూ పడుకున్నాక దీపం వెలుగులో తెల్లవార్లూ లెక్కలు చేసి కరెక్ట్ సమాధానాలు తెచ్చిందీ వాడే! నాకు సైకిల్ తొక్కడం నేర్పించి, నా మోకాళ్ళు చెక్కుకు పోతే, కొబ్బరి నూనె రాస్తూ ఏడ్చిందీ వాడే..!" అలాంటి అన్నయ్యని వెంటనే చూడాలని పాఠకులకి అనిపించేలా చేయడంలోనే రమణిగారి ప్రత్యేకత బయటపడుతుంది.

నవ్వుతూ మొదలు పెడతారు.. నవ్విస్తూ ముందుకి తీసుకెళతారు.. చివరలో ఒకటో రెండు వాక్యాలు వ్రాసి మనసుని వెంటాడుతారు.. వర్షం గురించి వ్రాస్తూ ఎవరూ చూడని కోణాలని చూపిస్తూ "చెట్టుకింద నిలబడితే వర్షం బయట తగ్గినా మనకి తెలీదు. ఎందుకంటే చెట్టు తన ప్రతి ఆకూ కడుక్కుంటూ నీళ్ళన్నీ మన నెత్తిమీద అక్షింతలుగా కురిపిస్తుంటుంది" అంటునే చివరికి "చిన్నప్పుడు రెయిన్ కోట్ తీసుకెళ్ళిన రోజు వర్షం వచ్చేది కాదు. తీసుకెళ్ళని రోజున అమాంతం దారికాది కొట్టేది..దొంగవాన! జీవితం అంతే..ఏదీ ఊహించి అడుగులెయ్యకండి.. థ్రిల్ పోతుంది..!" అని మన మనసుల్ని ఆలోచనల్లోకి విసిరేస్తారు! అలానే 'మొహమాటం' గురించి కడుపుబ్బ నవ్వించి "దారమ్మట మనం మానవత్వం విత్తనాలు చల్లుకుంటూ పోతే..తిరిగి వచ్చేటప్పుడు అవి తియ్యని ఫలాలతో ఎదురు చూస్తుంటాయి.." అని మరోసారి మనసు మూలల్ని స్పృశిస్తారు. ఇదే వాక్యం ఆధారంగా 'అందరి బంధువయా' సినిమా కథని అల్లి ప్రజామోదాన్ని పొందారు. ఈ శీర్షికల మరో ప్రత్యేకత స్క్రీన్ ప్లే తరహా కథనం. తొక్క శీను, గురించి , డ్రైవర్ కాంతారావు గురించి.. పని మనిషి గురించి..ఏదైనా సరే చదువుతుంటే ఒక టి.వి.ఎపిసోడ్ లేదా సినిమాలో దృశ్యం చూస్తున్న అనుభూతి కలుగుతుంది.

***

*Writer:*
**Balabhadrapatruni Ramani**
**Flat# 475, Kakateeya Nagar**
**Neredmet**
**Secunderabad – 500 556**




**మాతృదేశాన్ని వొదిలి కొన్ని దశాబ్దాలు గడిచినా** తనలోని సాహితీతృష్ణని నిత్యనూతనంగా పెంపొదించుకుంటూ నిరాటంకంగా కథా రచనని కొనసాగిస్తున్న కెనడా వాస్తవ్యురాలు శ్రీమతి కొమరవోలు సరోజగారు. కెనడా తెలుగువారి జీవితాల నేపథ్యంలో సరోజగారు వ్రాసినన్ని కథలు ఇంకే రచయితా/రచయిత్రీ వ్రాయలేదంటే అతిశయోక్తిలేదు. కేవలం ప్రవాసభారతీయులకే కాక ఆంధ్రదేశంలోని పాఠకులకు కూడా కొమరవోలు సరోజగారు చిరపరిచితులే. ఆంధ్రదేశం నుంచి వెలువడే చాలా పత్రికల్లో ముఖ్యంగా ‘వనితాజ్యోతి‘ లాంటి మహిళా పత్రికల్లోవీరి రచనలు తరచూ ప్రచురితమయ్యేవి. గత మూడు దశాబ్దాల్లో నాలుగు కథా సంపుటాలు వెలువరించారు. వాటిల్లో నాల్గవది ఇటీవలే విడుదలైన ఈ ‘యుగం మారింది‘. ఇందులో 35 కథలున్నాయి. ప్రతి కథకీ సందర్భోచితమైన చిత్రాలు కథలకి వన్నెతేవడమే కాక పుస్తకానికి కూడా ఒక పత్రిక చదువుతున్నామన్న భావన కలిగించాయి. సరోజగారు కథాంశాలనెన్నుకునే విధానం, కథలు చెప్పే విధానం కూడా చాలా విలక్షణంగా వుంటుంది. ఎక్కడా పెద్ద పెద్ద సందేశాలు, పాఠకులని తికమకపెట్టే మలుపులు ఉండవు. చాలా సాధారణంగా మన జీవితాల్లోనే సంఘటనలే కదా అనిపించే కథాంశాలు. మనచుట్టూ మనుషులే అనిపించే పాత్రలూ, ఏదో ఒక ఆలోచనా, చివరలో ఆలోచింపచేసే ముగింపూ సరోజగారి కథారచనలోని ప్రత్యేకతలు. ‘ఇలా జరిగితే ఎలా వుంటుంది?‘ అనే చిలిపి ఊహకి వ్యంగ్య రూపకల్పన ‘యుగం మారింది‘ , ‘పాపాయి స్వగతం‘ లో పసిపిల్లల ఆలోచనలకి పెద్దరికం వస్తే ఎలా ఉంటుంది అనే ఊహకి కథా రూపం ఇచ్చారు. సరోజగారి హాస్యచతురతకి ఉదాహరణ ‘యముడుకి విడాకులు‘. సరదాగా సాగుతూ అంతర్లీనంగా సందేశాన్నీ అందించే ఈ కథలు తెలుగు కథావనంలో విలక్షణంగా పరిమళించే కుసుమాలు.

***Publishers :***

***Sri Sarojini Publishing House***
***29-5-30, Eluru Road***
***Vijayawada - 2***

# పుస్తక పరిచయం




**కవితల్లో** మినీ కవితలు, హైకూలు, నానీలు, నానోలు..ఇలా ఎన్ని ప్రక్రియలున్నాయో కథారచనలో కూడా నవలలు, కథలు, కథానికలు, మినీ కథలు ఇలా..వివిధ ప్రక్రియలు గత 3-4 దశాబ్దాల్లో వచ్చాయి. రచనా విస్తరణ ఎక్కువగా ఉన్నంతకాలం రచయిత చెప్పదలుచుకున్నది వివరించడానికి చాలా వెసులుబాటు ఉంటుంది. ఐతే నిడివి తక్కువలో పాఠకుడ్ని ఆకర్షించేలా వ్రాయడం కత్తిమీద సాము లాంటిదే ఆ కోవకి చెందినవే మినీ కథలు. మొత్తం కథ అంతా కలిసి ఒక పేజీలోనో మహా ఐతే రెండు పేజీల్లోనో పూర్తవాలి. అంతలోనే రచనా ఫలం సిద్ధించాలి. ఇదొక సర్కస్ లాంటిదే ఇలాంటి ప్రక్రియని ఔపోసన పట్టిన రచయిత శ్రీ కె.బి.కృష్ణ. గత 31 సంవత్సరాలుగా తెలుగు సాహితీ రంగంలో తనకంటూ ఒక శైలిని, మార్గాన్నీ ఏర్పరచుకున్న కృష్ణగారు వ్రాసిన 101 మినీ కథల సంపుటి ఈ`అభిషేకం` పుస్తకం. ఈ రచయితే లోగడ 51 మినీ కథలతో ఒక సంపుటి ప్రచురించి వార్తల్లోకి ఎక్కారు. ఈ 101 మినీ కథల సంకలనం కూడ మరొక రికార్డే. ఇందులోని మినీ కథలన్నీ ఏదో ఒక పత్రికలో ప్రచురితమైనవే కావడం గమనార్హం. వీటిల్లో శైలీ సంక్లిష్టత ఉండదు, అర్థం చేసుకోడానికి పెద్దగా ఆలోచించాల్సిన అవసరమూ లేదు. అలవోకగా, సరళంగా, సూటిగా సాగే ఈ మినీ కథల్ని ఎక్కడైనా మొదలుపెట్టి చదువుకోవచ్చు. కృష్ణగారి కలంలో అతి సాధారణమైన సంఘటనలు కూడా మినీ కథల రూపం ధరించాయి. మామూలు సంభాషణో. ఒక చెణుకో, ఒక హాస్య ప్రసంగమో..మినీ కథా రూపంలో మన ముందుకి తీసుకురాగల ప్రతిభ కె.బి.కృష్ణగారి సొంతం. ఈ మినీ కథలకి శీర్షిక నిర్ణయించడం కూడ ఒక సవాలే. ఇందులోనూ రచయిత ప్రతిభ సుస్పష్టంగా కనిపిస్తుంది. `ఆరో ఆడపిల్ల`,` ఏమని చెప్పాలి`,` కత్తిపూడి జంక్షన్`,` కాంచనమాల`,` అభిషేకం`,` ఈ బాంబు వద్దురా కన్నా`..ఇలా ఆసక్తికరమైన శీర్షికలతో ఈ మినీ కథలు పాఠకులని ఇట్టే ఆకర్షిస్తాయి. ఈ రచయిత కలం నుంచి కేవలం కాలక్షేపం కోసమే కాక కొంచెం ప్రయోజనకారిగా ఉండే మినీ కథలు, పాఠకులని కొంచెమైనా ఆలోచింపచేసే కథలు, హృదయానికి హత్తుకునే కథలు..రావాలని ఆశిద్దాం.

*Writer:*
**K.B.Krishna**
**3-15/2 Gayatri Nilayam**
**Valasapakala**
**Kakinada– 533 005**
**Phone:0884-2358217**
**Cell : 9989102738**

***




**కౌముది పాఠకులకి** డా.మూలా రవికుమార్ పేరు సుపరిచితమే. తెలుగు కథా రచయితల్లో సొంతగొంతుక కలిగిన కొద్ది మంది రచయితల్లో రవికుమార్ గారు ఒకరు. కథా వస్తువుని ఎన్నుకోవడంలోనూ, కథా విస్తరణలోనూ కథ చెప్పే విధానంలోనూ రవికుమార్‌గారి కంటూ ఒక ప్రత్యేకత ఉంది. అది విజయనగరం జిల్లా యాస కావొచ్చు, పల్లెప్రజల అమాయక మనస్తత్వాల చిత్రణ కావొచ్చు, మూగ జీవాల ఆక్రందన కావొచ్చు..ఏదైనా ఈ రచయిత కలంలో ప్రత్యేకమైన రచనగా అందంగా రూపుదిద్దుకుంటాయి. పూర్తిగా కాకపోయినా ఈ కథలు చదువుతుంటే ఒక రావిశాస్త్రిగారో, బీనాదేవిగారో గుర్తొస్తారంటే అతిశయోక్తి లేదు. చింతలవలస అనేది ఉత్తరాంధ్రా ప్రాంతంలోని ఒక కుగ్రామం. చాలా వరకు కథలు ఆ వూరి పరిసరాల్లోనే తారాట్లాడుతుంటాయి. 'బడిశాల', ' దీనాతి దీనార్',' రైల్ వేపాకు' లాంటి కథలు చదువుతుంటే ఒక్కసారి ఆ వూరు వెళ్ళాలనీ,ఏ కల్తీ కల్మషం లేని ఆమనుషుల్తో మాట్లాడలని అనిపిస్తుందంటే అదంతా ఈ రచనల్లోని గొప్పదనమే. పూర్తి సరదా కథలని (రంగుల నీడల్లో) , పూర్తి సీరియస్ కథలని (ఫుడ్ చైన్) ఎంత ఆసక్తికరంగా వ్రాస్తారో, సరదాలో సీరియస్‌ని (దీనాతి దీనార్) కూడా అంత చదివించేలా వ్రాయగల సత్తా ఉన్న రచయిత డా.రవికుమార్‌గారు. చాలా కథలు ఆలోచింపచేస్తాయి, కొన్ని కథలు ఆ వాతావరణంలోకి పాఠకుడిని లాక్కెళ్తాయి, ఇంకొన్ని కథలు తమవైన శైలిలో చివరంటా చదివిస్తాయి. తెలుగుకథల్లో వైవిధ్యభరితమైన, ప్రయోజనకరమైన రచనలగురించి ఎప్పుడు ఎక్కడ మాట్లాడినా రవికుమార్‌గారి ప్రస్తావన తప్పని సరిగా ఉండాలి. ముందుమాటలో ప్రముఖరచయిత ఎలక్ట్రాన్ గారుఅన్నమాటలు ' డా.రవికుమార్ తెలుగు కథలను పాలపుంతలోకి తీసుకెళ్ళిన రచయిత. వర్ణనలకు దూరంగా ఉండి వాస్తవాలకు కథా రూపాలనిచ్చి తీరైన క్రమంలో,తనదైన శైలిలో వేగంగా కథల్ని చెప్పడంలో రచయిత కృతకృత్యుడయ్యాడు..' అన్న మాటలు అక్షర సత్యాలు. మంచి కథలు చదవాలనుకున్న పాఠకులకి విందుభోజనమీ 'చింతలవలస కథలు'.

***

***For Copies :***

***Visalandhra Book House***
***Prajasakti Book House***
***Navodaya Book House***
***Disa Pusataka Kendram***
***Navodaya Publishers***



# పుస్తక పరిచయం




రచయిత ఇ-మెయిల్: innaiah@gmail.com

***For Copies :***
***Visalandhra Publishing House***
***Navodaya Book House***
***Arts and Letters - Hyderabad***

**కేవలం రచయిత ఊహల్లోంచి** రూపుదిద్దుకున్న కథలు, కవితలు లాంటివి కాల్పనిక సాహిత్యం ఐతే, సీరియస్ సాహిత్యం ఇంకో తరగతికి చెందింది. రచయిత మేథో మథనం నుంచి, విశ్లేషణాత్మక ఆలోచనల్లోంచి, నగ్న సత్యాల సమీక్షల్లోంచి వచ్చేది సీరియస్ సాహిత్యం. ఇది ఆహ్లాదకరంగా ఉండడం, హృదయాలను తాకడం - ఇలా కాకుండా, మెదడుకి పదును పెడుతుంది, ఆలోచనలకు పునాది వేస్తుంది. ఆలోచించగల శక్తి ఉన్న మనల్ని ఆ శక్తిని ఉపయోగించుకోమని పదే పదే గుర్తు చేస్తుంది. ఆ తరహాకి చెందిన సాహిత్యమే ఈ 'మిసిమి వ్యాసాలు' సంపుటి. గత ఇరవై సంవత్సరాలుగా 'మిసిమి' పత్రికలో వచ్చిన వ్యాసాలు ఇందులో చోటుచేసుకున్నాయి. రచయిత శ్రీ నరిసెట్టి ఇన్నయ్యగారు. ఇన్నయ్యగారిని తెలుగు పాఠకులకి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. తెలుగులోను, ఆంగ్లంలోనూ ఎమ్.ఎన్.రాయ్, హ్యూమనిజం, మూఢాచారాలు, జాతి, మతం, కులం మొదలైన విషయాలపై 50కి పైగా పుస్తకాలు వ్రాశారు. కేవలం రచయితగానే కాక తాను నమ్మిన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసెకెళ్ళేందుకు అవిశ్రాంతంగా శ్రమించే నిబద్ధత గల కార్యకర్తగా కూడా ఇన్నయ్యగారు చాలామందికి పరిచయమే. ఈ పుస్తకంలోని వ్యాసాలు గత రెండు దశాబ్దాల కాలపరిమితిలో వ్రాసినా, ప్రతిదీ ఇప్పటికీ నిత్యనూతనంగానే ఉంటుంది. ఇందుకు ముఖ్యకారణం ఈ వ్యాసాల్లోని వస్తువు. సుభాష్‌చంద్రబోస్, బెర్ట్రాండ్ రస్సెల్,స్పినోజా, లెబ్నిజ్, విట్‌గెన్‌స్టైన్..ఇలాంటి వ్యక్తుల గురించిన విశేషాలు ఎప్పుడు చదివినా ఆలోచనాత్మకంగానే ఉంటాయి. హిందూయిజం, బౌద్ధ విప్లవం, పునర్జన్మ, ఇంద్రియాతీత శక్తులు..ఇలాంటి వ్యాసాలు ఎంతో విశ్లేషణాత్మకంగా ఉన్నాయి. ఈ రచయిత భావాలతో వైరుధ్యం ఉన్న పాఠకులైనా సరే చదివితీరాల్సిన పుస్తకం ఇది. ఎందుకంటే రచయిత చెప్పదలచుకున్న విషయాన్ని కేవలం ఉపరితలాన్ని స్పృశించివదిలెయ్యకుండా, లోతులకెళ్ళి అత్యంత కూలంకషంగా విశ్లేషించి, చర్చించిన వ్యాసాలివన్నీ. ఖచ్చితంగా ఆలోచనలకు పదునుపెట్టేవీ, కొత్త ఆలోచనలను ప్రేరేపించేవీ ఐన ఇలాంటి వ్యాసాలు ఈ తరం పాఠకులకి చాలా అవసరం. ఇన్నయ్యగారి లాంటి దీర్ఘ కాల నిబద్ధత గల రచయితలు చాలా అరుదుగా కనిపిస్తారు. ***




**‘తెలుగు పద్యాలా బాబోయ్..‘** పుస్తకానికి వేసిన ముఖచిత్రం కూడా పేరుకి తగినట్లే ఇదేదో హాస్యభరిత పుస్తకం అనిపించేలా ఉంది. తెలుగు పద్యాలకి అచ్చతెలుగులో వ్యాఖ్యానం చెబితే అంతగా అర్థం కాదనుకున్న రచయిత తెలుగు పద్యాలకిచ్చిన వివరణలో వీలైనన్ని ఇంగ్లీషు పదాలని జొప్పించి నవ్వించే రీతిలో వ్రాశారు. ”తెలుగు వచ్చినా తెలుగు పద్యాల జోలికి పోని వాళ్ళకు వాటిలో మజా చూపించడమే నా ఉద్దేశం” అని మొదట్లోనే తన ప్రణాళికని సుస్పష్టం చేశారు. అంచేత భాషా ప్రాభవం గురించి, అందమైన పద సౌరభాల గురించి పాఠకులు వెదకాల్సిన అవసరం లేదు. పారిజాతాపహరణంలోని పద్యాన్ని పరిచయం చేయడానికి ”హీరోను తన్నిన హీరోయిన్” అనే శీర్షిక ఎంచుకున్నారు. పాండవోద్యోగ విజయాలలోని పద్యాలని వివరించేందుకు ”హాయ్ ! బావా!” అన్న శీర్షిక పెట్టారు. శ్రీనాథుడిని ‘మాస్టర్ బ్లాస్టర్‘ అంటూ ”అతి చిన్న వయసులోనే గంటం పట్టి అసమాన ప్రతిభతో ”బ్యాటింగ్” తెగ చేసేయడమే కాకుండా చివరి బంతిని సిక్సర్ కొట్టిన తెలుగు కవి శ్రీనాథుడు” అని పరిచయం చేశారు. ఈ రచయిత పద్యాలని, ఆయా రచయితలనీ హేళన చేస్తున్నారేమో అని ఒక్క క్షణం అనిపిస్తే అది పాఠకుల పొరబాటే అనుకోవాలి. నిజానికి రచయితకి తాను గుర్తుంచుకున్న పద్యాల పట్ల ఎంతో మక్కువ వుంది. చాలా వరకూ సరదా శైలిలో సాగినా కొన్ని పద్యాలకి ముక్తాయింపులో ఇచ్చిన వివరణలూ, వివరాలూ రచయితకి ఈ పద్యాల పట్ల స్పష్టమైన, కూలంకషమైన అవగాహన ఉందన్న విషయం తెలియచేస్తాయి. స్వపరిచయంలో కూడా ”ఐ.ఐ.టి లో ఎమ్.టెక్ వెలగబెట్టాను..” అని వ్రాసుకున్నారు. మొత్తానికి తెలుగు పద్యాలని ఇంత విభిన్న శైలిలో పరిచయం చేసిన పుస్తకం ఇదొక్కటేనేమో!

****

***For Copies :***

***Visalandhra Book House***
***Navodaya Book House***

***Writer : issastry@hotmail.com***

# పుస్తక పరిచయం




**మూడు సంవత్సరాల పాటు** కౌముది పాఠకులని అలరించిన 'అగ్రహారం కథలు' ఇప్పుడు పుస్తకరూపంలో వెలువడ్డాయి. కన్నతల్లి మీద ఎంత ప్రేమ ఉంటుందో సొంతవూరు మీద అంత మమకారం ఉంటుందనేది నిత్యజీవిత సత్యం. ఏమాత్రం మరకలు పడని అద్దంలాంటి బాల్యంలో సొంతవూరు కలిగించే అనుభూతులు అనిర్వచనీయమైనవి. అలాంటి అనుభూతుల్ని, అనుభవాల్ని అక్షరాల్లో పొదగడమనేది ఓ కళ. ఎవరికి వారు తమ జ్ఞాపకాల పొదరిళ్ళలో అనుభూతించడం ఒక ఎత్తైతే , ఆ జ్ఞాపకాలు విన్న ప్రతివాళ్ళలో ' ఈ జ్ఞాపకాలు నావే..ఈ మనుషులు నాకూ తెలిసిన వాళ్ళే ' అనే భావం కలిగించడం మరో ఎత్తు.

డా.వేదుల సుభద్రగారి అగ్రహారం కథలు చదువుతుంటే ఇలాంటి భావనే కలుగుతుంది. సుభద్రగారి కథల్లో ఉన్న గొప్పతనం ఏమిటంటే ఎక్కడా సంఘర్షణకానీ, వివాదం కానీ, ప్రతినాయక పాత్రలు కానీ. దుష్ట పాత్రలూ కానీ ఉండవు. అందరూ మంచివారే, అందరివీ మంచిమనసులే, కష్టాల్లో ఒకరినొకరు ఆదుకునేవారే. అసూయా ద్వేషాలూ, మద మాత్సర్యాలూ మచ్చుకైనా కనిపించవు. మంచి తనాన్ని ఎత్తిచూపించాలంటే దుష్టత్వాన్నీ పోలికగా చూపించాలి అన్న సూత్రాన్ని అన్నివేళలా పాటించాల్సిన అవసరం లేదు అని రచయిత్రి అనుభవపూర్వకంగా ఈ కథల ద్వారా నిరూపించారు.

జీవితాల్లో ఆనందాలకి ఎంతో ఐశ్వర్యం, త్యాగాలకి గొప్ప సందర్భాలు అవసరం లేదని ఎన్నో సంఘటనల ద్వారా, పాత్రల ద్వారా చెబుతారు రచయిత్రి. అమాయకత్వమే ఆనందం, ఉన్నది పంచుకోగలగడమే త్యాగం అని ఈ కథలు చెబుతాయి. " నీ బలహీనత నాది, నా బలం నీది" అని చెప్పే 'అరుగుమీది సత్యం గారు' ; "మిషన్ తిరిగిందంటే రైలు చక్రం తిరిగినట్టే" అని ఫేషన్ ప్రపంచం తన వృత్తిని మింగేస్తున్నా దాన్నే అంటి పెట్టుకుని ఉన్న 'మిషన్ సూరన్న' ; అలవాటులేని పని చేసి నిజాయితీ పరిధిని దాటి గుండెనొప్పి తెచ్చుకున్న 'కంసాలి నాగలింగం' ; ఇదుగో అదుగో అనడమే తప్ప కన్నవారిల్లు విడిచి వెళ్ళలేని 'పెద్దావిడ' ; నిచ్చెన వేసుకుని గడ్డిమేటు ఎక్కి కూర్చుని, మామిడికాయలూ, చెరుకుముక్కలూ తింటూ మంచి పుస్తకం చదువుకోవాలనే చిన్ని కోరికని ఏళ్ళతరబడి దాచుకున్న యాభై ఏళ్ళ 'పద్మావతమ్మగారు'; "ఇంకో ఆరు నెలలు జీవితం ఉంటే భార్యకోసం, పిల్లల ఆనందం కోసమే గడపాలనుకునే 'సింహంలాంటి సూర్యంగారు' ; చిట్టితల్లి - పండు మేష్టారు..... - ఒక్కరా ఇద్దరా..ఎంతమంది ఆత్మీయులు, ఎంతమంది బంధువులూ...!! 'అగ్రహారం కథలు' పేజీ పేజీకి మనసుని ఆర్ద్రం చేసే పాత్రలూ, సన్నివేశాలూ కనిపిస్తాయి. ఇందులో చాలా కథలు కళ్ళముందు దృశ్యాల్ని చిత్రీకరించినట్లు , మంచి టివి ఎపిసోడ్ చూస్తున్నట్లూ అనిపిస్తాయి. పలచబడి పోతున్న మానవసంబంధాలని, మనసుల మధ్య ఆత్మీయతలని మరొక్కసారి పట్టిచూపించే ఈ అద్భుతమైన కథలు వ్రాసిన డా.వేదుల సుభద్రగారికి హృదయపూర్వక అభినందనలు.

***

*Published by:*
**Vahini Book Trust**
**1-9-286/2/P Vidyanagar**
**Hyderabad – 500 044**

*Copies available at:*
**Navodaya Book House**
**and all other leading book stores.**




**తెలుగుసాహిత్యంలో సీరియస్ కథలు,** వాస్తవచిత్రణకి పెద్దపీట వేసే కథలు తక్కువగానే వస్తున్నాయని చెప్పుకోవచ్చు. భయంకరమైన వాస్తవాలకి, నగ్న సత్యాలకి, ఆలోచనలని మరిగించే సంఘటనలకి కథారూపమిచ్చే గుండెధైర్యం, కలం బలం వున్న రచయిత ఎస్.గణపతి రావు. గతంలో 'మరిగే తారు సరోవరం' అన్న కథా సంపుటాన్ని వెలువరించింది ఈ రచయితే. తన నిబద్ధతకి, సమాజంలోని అసంబద్ధతకి నిలువుటద్దాలుగా నిలిచే మరికొన్ని కథలని ఈ 'నిప్పుల తుఫాన్'లో చేర్చారు. మంచి సమాజంకోసం ధైర్యవంతుల కథలు అని ముఖపత్రం మీదనే స్పష్టంగా ప్రకటించారు.

రోజూ వార్తాపత్రికల్లోనూ, టి.వి.ఛానళ్ళలోనూ ఎన్నో అమానవీయ సంఘటనలగురించి చదువుతాం. చదివిన కాస్సేపు 'అయ్యో ' అనిపిస్తుంది. మళ్ళీ జీవనపోరాటంలో పడగానే మన సమస్యలే మనల్ని పూర్తిగా ఆవరిస్తాయి. అలాకాకుండా మెరుగైన సమాజంకోసమే అహరహం పరితపించే ఈ రచయిత తన కథల్లో వాస్తవాలని ఏమాత్రం సంకోచించకుండా యదాతథంగా మనముందు పెట్టారు. 'ఇది తెలుసుకోవడం మన బాధ్యత కాదా? దీన్ని మార్చడం మన వంతుకాదా?' అని నిలదీసి ప్రశ్నిస్తారు. ఈ రచయిత స్వరం తీవ్రంగా ఉంటుంది. రచనా శైలిలో ఆ స్వరం ప్రతిధ్వనిస్తుంది. భారతదేశంలో అధికశాతం మందికి వృద్ధాప్యం శాపంలా మారిన పరిస్థితిని చిత్రిస్తూ 'ఆత్మీయతలేని నిష్క్రమణల మాటేమిటి' అని నిలదీస్తారు 'చిట్టచివరి మెట్టు' అనే కథలో. . అవినీతిని ఆపే శక్తి అందరికీ లేకపోవచ్చు, కనీసం అవినీతి పరుల గుండెల్లో దడ పుట్టించలేమా? అని ఆలోచనలు రేకెత్తిస్తారు 'తలకింద రైలు' అనే కథలో. 'రంగుల తుళ్ళింత' అనే కథలో స్త్రీని పూర్తిస్థాయి వ్యాపారవస్తువుగా చిత్రిస్తున్న సమకాలీన చలనచిత్ర పరిశ్రమని ఎక్స్-రే తీసి చూపిస్తారు. సమాజంలో ఎక్కడ, ఏమూల చూస్తే గుండె చెదురుతుందో , 'ఇదేమిటి..ఇలా ఎందుకు' అనిపిస్తుందో అన్ని కోణాలని స్పృశించారీ రచయిత. ప్రతి కథకీశీర్షిక క్రిందనే ఇచ్చిన క్లుప్త పరిచయాలు కూడా ఈ పుస్తకంలోని వైవిధ్యతకి ముందుగానే అద్దం పడతాయి. పునాదుల్లోంచి ప్రళయం, పాలబుగ్గలు, జాతి ఏమైంది, తలలూపే గడ్డిపరకలు - ఇలా కథలకి ఎంచుకున్న శీర్షికలే కాక పుస్తకం అలంకరణ కూడా వినూత్నంగా, ఆకర్షణీయంగా ఉంది. సమాజంలోని అవకతవకలగురించి ఏ కొంచెం ఆలోచించే అలవాటున్న పాఠకులైనా తప్పని సరిగా చదవాల్సిన పుస్తకం. మామూలు పాఠకులకి కూడా సాహిత్యం ద్వారా చైతన్యం రగిలించే ప్రక్రియ ఎలా ఉంటుందో తెలుస్తుంది ఈ కథలు చదువుతుంటే.

***

**_Publishers:_**
**_S.Ganapathi Rao_**
**_Padgro Consultants(P) Ltd_**
**_12, Lady Madhavan Road_**
**_Chennai – 600 034_**
**_mtsbooks2011@yahoo.in_**
**_Dolphin_enter1@yahoo.com_**